తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ బుధవారం 06 - 05 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3




# మోత్కూరులో బీఆర్ఎస్ రాస్తారోకో

- నెల రోజులవుతున్నా ధాన్యం సరిగా కొనడం లేదు
- తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్న అధికారులు, మిల్లర్లు

**ప్రజావారధి/మోత్కూరు**

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులవుతున్నా ధాన్యం సక్రమంగా కొనకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులు మోత్కూరు వ్యవసాయ మార్కెట్ ఎదురుగా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. తొలుత మార్కెట్ యార్డులో ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీను, మార్కెట్ మాజీ చైర్మన్లు కొణతం యాకూబ్‌రెడ్డి, చిప్పలపల్లి మహేందర్‌నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటవెంటనే ధాన్యం కొనకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులవుతున్నా అరకొరగా తూకాలు వేసి చేతులు దులుపుకుంటున్నారని, దీంతో రైతులు రోజుల తరబడి పడిగాపులు పడుతూ నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై 40 కిలోల బస్తాకు అదనంగా రెండు, మూడు కిలోలు అదనంగా తూకం వేసి రైతులను దోచుకుంటున్నారని, మిల్లుల వద్దకు వెళ్లాక తరుగు పేరుతో మళ్లీ కటింగులు పెడుతున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతున్నారని తెలిపారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వం వెంటవెంటనే తూకాలు వేయాలని, అదనపు తూకాలు, తరుగు పేరుతో కటింగులు లేకుండా కొనుగోలు చేయాలని, ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కొండ సోంమల్లు, కౌన్సిలర్ సుల్తాన్ స్వామి, డీవీఎంసీ జిల్లా కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్, మాజీ ఎంపీటీసీ పానుగుల్ల విష్ణుమూర్తి, గ్రామశాఖల అధ్యక్షులు కడమంచి వస్తాద్, నేర్లకంటి మత్స్యగిరి, పసునూరి సత్తిరెడ్డి, మాజీ సర్పంచులు బయ్యని పిచ్చయ్య, బత్తిని తిరుమలేష్, నాయకులు కూరెళ్ల పరమేష్, పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, నల్ల ప్రభాకర్, కోక భిక్షం, చేతరాశి వెంకన్న, అన్నందాస్ విద్యాసాగర్, మొరిగాల వెంకన్న, మొరిగాల శ్రీనివాస్, జంగ సతీష్, లోతకుంట అనిల్, బందెల శ్రీను, జిట్ట సాయి కుమార్, పొన్నెబోయిన మత్స్యగిరి, చక్క అశోక్, కూరెళ్ల సురేష్, దాసరి ఎలెందర్, కొంపెల్లి మల్లేష్, బుర్ర వెంకన్న, బద్దం సంజీవరెడ్డి, గజ్జి నర్సింహ, గంధమాల కిష్టయ్య, పులగం దామోదర్ రెడ్డి, మర్రి వెంకన్న, కల్వల రాము, బాలగాని శ్రీను, కొమురయ్య, అవిశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# మోత్కూరు చేనేత సహకార సంఘంలో..

## మామూళ్లు ఇస్తేనే పనులు



- రూ.5 లక్షల నేతన్న బీమా చెక్కు ఇచ్చేందుకు రూ.40 వేలు వసూలు
- డబ్బులిస్తేనే రుణమాఫీ, త్రిఫ్ట్ పథకం అమలు
- డబ్బులు ఇవ్వని కార్మికులకు బెదిరింపులు
- ప్రభుత్వ పథకాలకు డబ్బులు వసూలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి
- మోత్కూరు పట్టణ పద్మశాలి సంఘం డిమాండ్

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు చేనేత సహకార సంఘంలో పనిచేసే కొందరు వ్యక్తులు మామూళ్లు ఇస్తేనే పనులు చేస్తున్నారని, మామూళ్ల పేరుతో కార్మికులను వేధింపులకు గురిచేయడంతో పాటు బెదిరిస్తున్నారని మోత్కూరు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పోచం భిక్షపతి ఆరోపించారు. మంగళవారం మోత్కూరులో జరిగిన పట్టణ పద్మశాలి సంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. చనిపోయిన ఓ కార్మికునికి ఇటీవల నేతన్న బీమా పథకం ద్వారా రూ.5 లక్షల బీమా చెక్కు మంజూరైందని, చేనేత సహకార సంఘంలో పనిచేస్తే వ్యక్తులు ఆ కార్మికుని కుటుంబం రూ.40 వేలు ఇస్తేనే చెక్కు ఇచ్చారని తెలిపారు. రుణమాఫీ పథకంలో రూ.లక్ష మాఫీ అయిన కార్మికుల నుంచి రూ.6 వేలు, రూ.50 వేలు మాఫీ అయిన కార్మికుల నుంచి రూ.3 వేలు వసూలు చేశారని, త్రిఫ్ట్ పథకంలో ప్రతి కార్మికుని నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. డబ్బులు ఇవ్వని కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందకుండా అడ్డుకుంటున్నారని, డబ్బులు ఇవ్వకుంటే చెక్కులు, రుణమాఫీ కాకుండా కార్మికులపై బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. సహకార సంఘంలో మామూళ్ల వ్యవహారంపై కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోత్కూరు చేనేత సహకార సంఘం పరిధిలో అనేక మంది కార్మికులు అర్హులుగా ఉన్నప్పటికీ వారికి సభ్యత్వం ఇవ్వడం లేదని, దీంతో ఆ కార్మికులు సంఘం కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం కోల్పోయి సంఘంలో జరుగుతున్న ఏ కార్యక్రమాలపై వారికి అవగాహన ఉండటం లేదని, ఎన్నికల్లో ఓటు హక్కు కూడా కోల్పోతున్నారని తెలిపారు. 30, 40 సంవత్సరాలుగా సభ్యత్వం కోసం ఎదురు చూస్తున్న కార్మికులు ఉన్నారంటే సంఘంలో ఎలాంటి ఆధిపత్యం చెలాయిస్తున్నారో అర్థమవుతుందని, చాలా మంది కార్మికులు సభ్యత్వం పొందకుండానే చనిపోతున్నారని, ఇది తీవ్రమైన సామాజిక అన్యాయమన్నారు. సంఘంలో ఆధిపత్యం చెలాయించడానికే కార్మికులందరికీ సభ్యత్వాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, కేవలం తమ కుటుంబ సభ్యులు, బంధువులు, అనుకూలంగా ఉన్నవారికే ఇస్తున్నారని, సంఘాన్ని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకుని ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలేవీ అందకుండా చేస్తున్నారని, సంఘం లావాదేవీలు, కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికునికి సభ్యత్వం ఇవ్వాలని, సభ్యత్వం పొందిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని, సభ్యత్వ ప్రక్రియ పూర్తయ్యిన తర్వాతే సంఘ ఎన్నికలు నిర్వహించాలని, మరణించిన సభ్యుల స్థానంలో వారి కుటుంబంలోని అర్హులైన వ్యక్తికి వారసత్వ సభ్యత్వం ఇవ్వాలని, చేనేత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని, చేనేత కుటుంబాలందరికీ ఫ్యామిలీ కార్డులు జారీ చేసి ఖచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలని, ఆరోగ్య బీమా కార్డులు అందించాలని, మరణించిన ప్రతి చేనేత కార్మికునికి రూ.5 లక్షల బీమా పరిహారం అందించాలని, అర్హులైన చేనేత కార్మికులకు తక్షణమే పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల నారాయణ, ప్రధాన కార్యదర్శి జిల్లా రవీందర్, కోశాధికారి గుర్రం అంబదాసు, సహాయ కార్యదర్శి పోచం శ్రీను, ప్రచార కార్యదర్శులు పగడాల లక్ష్మీనర్సు, మహేశ్వరం శ్రీను, డైరెక్టర్లు చిట్టిప్రోలు శంభులింగం, మహేశ్వరం హనుమంతు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





# బీఆర్ఎస్‌కు పాలడుగు సర్పంచ్ నమ్మక ద్రోహం

## టికెట్ ఇవ్వని కాంగ్రెస్‌లో ఎలా చేరతారు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పాలడుగు గ్రామ సర్పంచ్ అంతటి భగవంతు బీఆర్ఎస్‌ను నమ్మించి మోసం చేశారని బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మరిపెల్లి చంద్రయ్య, ప్రధానకార్యదర్శి కొంపెల్లి అంజయ్య అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో భగవంతుకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదని, కాంగ్రెస్ తనను మోసం చేసిందని భగవంతు బీఆర్ఎస్‌ను ఆశ్రయించి మద్దతు కోరారని, దీంతో బీఆర్ఎస్ నిలబెట్టిన అభ్యర్థి మరిపెల్లి శేఖర్‌తో సహా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలంతా భగవంతుకు అండగా నిలిచి మద్దతు తెలిపామని, దీంతో ఆయన 168 ఓట్లతో గెలిచారని తెలిపారు. బీఆర్ఎస్ మద్దతు ఇవ్వకుంటే ఆయన గెలిచేవాడా అని ప్రశ్నించారు. సర్పంచ్‌గా గెలిచిన తర్వాత బీఆర్ఎస్‌లో చేరతానని చెప్పి ఇప్పుడు టికెట్ ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్‌లో ఎలా చేరతారని, ఇలాంటి మోసకారి వ్యక్తులను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నాయకులు బొడిగ మల్లేష్, కొంపెల్లి మల్లేష్ వారి వెంట ఉన్నారు.

### డైరెక్టర్లకు సమాచారం ఇవ్వకుండా

# చైర్మన్‌గా బాధ్యతలు ఎలా చేపడతారు

## సింగిల్‌విండో చైర్మన్ పదవీకాంక్షపై డైరెక్టర్ల ఆగ్రహం



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు సింగిల్‌విండో డైరెక్టర్లకు సమాచారం ఇవ్వకుండానే చైర్మన్‌గా పేలపూడి వెంకటేశ్వర్లు ఎలా బాధ్యతలు స్వీకరిస్తారని సంఘం డైరెక్టర్లు సామ పద్మారెడ్డి, పురుగుల మల్లయ్య యాదవ్ ప్రశ్నించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల సింగిల్‌విండో పాలక వర్గాలను రద్దు చేసిందని, రైతులతో ఎన్నికలకు వెళ్లే దమ్ము లేక కాంగ్రెస్ నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను నియమించాలని చూడగా కోర్టు ప్రభుత్వానికి చీవాట్లు పెట్టిందని తెలిపారు. కొత్త కమిటీలను ఎన్నుకునే వరకు పాత పాలక వర్గాలను కొనసాగించాలని కోర్టు చెప్పడంతో పదవీ కాంక్షతో ఉన్న మాజీ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు డైరెక్టర్లు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే నేరుగా కుర్చీలో కూర్చుని చైర్మన్‌గా బాధ్యతలు ఎలా చేపడతారని, అధికారులు కూడా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. పదవిపై వ్యామోహం ఉంటే సరిపోదని, సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులవుతున్నా ధాన్యం కొనకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అకాల వర్షాలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట దెబ్బతింటుందని రైతులు కంటిపై కునుకు లేకుండా గడుపుతున్నారని, రైతులపై ఏమాత్రం ప్రేమ ఉన్నా వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.